కథ



# బాంధవ్యబంధం

- వలివేటి నాగచంద్రావతి

"ఇంతదాక మార్కెట్లో జయమ్మ పి... కనిపించింది." తెచ్చిన కూరలు విడదీస్తూ స్వరంలో ఏ భావమూ తొణకనీకుండా చెప్పాను.

'దారిలో పులి ఎదురొచ్చింది' అని చెప్పినట్టుగా ఉలిక్కిపడింది అమ్మ. అంతలోనే తెప్పరిల్లి "దుష్టగ్రహ దరిశనం. వెంటనే తలస్నానం చెయ్. కొంతన్నా దోషం పోతుంది" కఠినంగా అని విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

ద్రోహం - అది చేసిన గాయం ఇన్నేళ్ళయినా మానుపట్టలేదు అమ్మకి. అవును, ఆ దెబ్బ సామాన్యమైనదా! నిట్టూర్చాను.

నేను ఆఫీసుకు తయారవుతుండగా మళ్ళీ గదిలోకి వచ్చింది అమ్మ. "దేవీ" అని ఆగి, "ఎలా ఉన్నదది?" అనడిగింది. అమ్మ కంఠంలో మొహమాటం తెలుస్తోంది నాకు. 'అది' అంటే జయమ్మ పిన్ని. స్వయానా అమ్మకి చెల్లెలు. అమ్మ దృష్టిలో దుష్టగ్రహం.

"బావుంది."

"ఎందుకు బావుండదూ" అమ్మ మామూలయిపోయింది. "అందరి ఉసుర్లూ పోసుకుని అది బాగానే ఉంటుంది. దాని సెగ తగిలి మనమే మాడిపోయాం. ఆ- ఆ- నేనూ చూస్తాగా - ఎన్నాళ్ళో ఆ మిడిసిపాటు - దేవుడు లేడూ" చివర్లో అమ్మ గొంతులో ఆ విసురు స్థానే తడివచ్చి చేరుకుంది.

అమ్మ ఆక్రోశం పూర్తవటానికి కాలపరిమితి ఉండదు ఒక్కోసారి. సానుభూతిగానో విచారంగానో చూస్తూండటం మినహా ఏం చేయగలను?

'మౌనమె నీ భాష ఓ మూగ మనసా...' నాకిష్టమైన ఆ పాట నా సెల్ రింగ్‌టోన్. సెల్ మోగటం విని మాటలాపింది అమ్మ. ప్రశ్నార్థకంగా మొహంపెట్టి ఊపిరి పీల్చుకున్నాన్నేను.

సెల్ చెవి దగ్గర కొచ్చింది. అవతలున్నది గిరిజ. డా॥ గిరిజ. నాకు మంచి స్నేహితురాలు.

"బ్లడ్ డొనేట్ చేసి ఎన్నాళ్ళయింది? అహ ఏం లేదూ, నీ గ్రూప్ రక్తం చాలా అవసరం ఓ పేషెంటుకి."

"పది రోజులయింది. పర్లేదులే ఇస్తాను. ఎప్పుడు రమ్మంటావ్, ఆఫీసుకు వెళుతూ రానా. ఓ పావుగంటలో పంపించేస్తావుగా?" అడిగాను ఆలస్యం చేయకుండా.

"ఏమిటీ, రక్తం ఇస్తావా... మతిగానీ పోయిందా. పదిరోజులన్నా అవలేదు ఆ యాక్సిడెంటు కుర్రాడికిచ్చి. మళ్ళీ అప్పుడేనా? ఊహుం నేనొప్పుకోను. నువ్వు వెళ్ళటానికి వీల్లేదు" కీచుగొంతుతో అరుస్తోంది అమ్మ.

తననిప్పుడు ఒప్పించి వెళ్ళాలనుకోవటం సాధ్యమయ్యేపనికాదు. నేను కామ్‌గా వెళ్ళి స్కూటీ తీశాను. "ఆగు, నేనూ వస్తాను" వారించే వ్యవధి ఇవ్వకుండా వెనకెక్కి కూర్చుంది అమ్మ.

ఇక తోవ పొడుగునా నస పెడుతూనే ఉంది. "దానానికైనా ధర్మానికైనా ఓ హద్దుండాలే. నీకేం, తగుదునమ్మా అని పదిరోజులకోమాటు రక్తం ధారపోసొస్తావ్. ఇలా పాటికి పదిమాట్లు రక్తం ఓడుస్తూపోతే ఒంట్లో సత్తువేం మిగుల్తుంది? తయ్యిమంటూ బయల్దేరావ్, అక్కడ కళ్ళు తిరిగి పడిపోతే నీకెవరు దిక్కు? ఆ డాక్టరుకేమీ- ఇస్తానంటే చర్మమైనా ఒలిచి ఇచ్చెయ్యమంటుంది. మనకే బుద్ధుండాల్సింది. వెడుతున్నాంగా చెబుతా... ఆ డాక్టరుతోనే చెబుతా - ఎవరికి నెత్తురు అవసరంపడినా నీకు నా కూతురే జ్ఞాపకం రావటం న్యాయం కాదమ్మా అని."

నేనెప్పుడు బ్లడ్ డొనేట్ చేసినా అమ్మ అలా కస్సుకస్సుమంటూనే ఉంటుంది. నవ్వుకున్నాను. గిరిజ ముందుకు వెళ్ళేదాకానే అమ్మ ప్రతాపం అని నాకు తెలుసు.

మమ్మల్ని చూడగానే "థాంక్ గాడ్, వచ్చేశారా! రండి రండి" అంది గిరిజ రిలీఫ్‌గా.

కూర్చున్నాం.

"రెండురోజుల కిందటే జాయినయింది ఆ పేషెంటు. నార్మల్ డిసీజ్ అనుకున్నారట. గచ్చాకు పుచ్చాకు వైద్యం చేసి వ్యాధిని బాగా ముదరపెట్టేశారు. టెస్టులన్నీ చేయించాం. హైదరాబాదు తీసుకువెళితే బెటర్ అన్నారు ప్రమోద్."

ప్రమోద్ గిరిజ భర్త. ఆయన కూడా డాక్టరే.

"ఉన్నట్టుండి ఈ తెల్లవారుజామున బ్లడ్ వామిటింగ్ చేసుకుంది. అసలే బాగా ఎనిమిక్‌గా ఉంది. జర్నీలో కొలాప్సయ్యే ప్రమాదం ఉంది. బ్లడ్ ఎక్కిద్దాం అనుకున్నాం. వెంటనే నువ్వు గుర్తొచ్చావ్. నీ బ్లడ్ గ్రూపే తనది. ఏబి నెగెటివ్. వేరే 'వే' ఆలోచించలేదు నేను. వెంటనే నీకు ఫోన్ చేశాను."

పులుకూ పులుకూ చూస్తోంది అమ్మ మాట్లాడకుండా. "అన్నట్టు అమ్మా-" గిరిజ అమ్మవైపు తిరిగింది.

"వాళ్ళు మీ ఊరునుంచే వచ్చారట. పల్లెటూరు కదా, బహుశా మీకు తెలిసినవాళ్ళయి ఉండొచ్చు. రూమ్ నంబర్ పిఫ్టీన్‌లో ఉన్నారు. ఓసారి తొంగిచూసి రండి. ఈలోగా..." నావైపు అర్థవంతంగా చూసింది గిరిజ.

'నాకు రక్తం తీసేటప్పుడు అమ్మ చూసి బాధపడకుండా ఈ ఏర్పాటన్నమాట. పాపం గిరిజ ఉద్దేశ్యమయితే మంచిదేకానీ ఆమెకి ఒకటి తెలీదు - ఆ ఊరన్నా ఆ ఊరి మనుషులన్నా అమ్మకి తగని ద్వేషమని. ఇప్పుడా ఊరి పేషెంటుకి రక్తం ఇవ్వటానికిససేమీ వీల్లేదంటుందేమో ఖర్మ.' భయంభయంగా అమ్మ వంక చూశాను. అమ్మ మొహంలో కలవరపాటు, అయిష్టం. కానీ, అందులోనే తొంగిచూస్తున్న ఓ కుతూహలం కనిపించాయి నాకు. గిరిజ సూచనని ఒప్పుకున్నట్టుగా కదిలింది కూడా - అమ్మయ్య.

కానీ, అలా వెళ్ళిన అమ్మ ఇలా తిరిగొచ్చేసింది గోడకి కొట్టిన బంతిలాగ. మళ్ళీ ఎలాగ..? తుఫాన్‌లాగ. వస్తూనే, "పద, నువ్వెవ్వరికీ రక్తం ఇవ్వక్కరలేదిక్కడ. పద- ముందు లే..." దూకుడుగా అంటూ నా చెయ్యి పట్టుకు గుంజటం మొదలుపెట్టింది.

వెళ్ళినప్పుడు ప్రసన్నంగానే వెళ్ళిందే. ఉన్నట్టుండి అమ్మ ఎందుకిలా మారింది చెప్మా!

"ఎందుకమ్మా, అలా అంటున్నారు? ఆమె ఎంత ప్రమాదంలో ఉందో చెప్పాను గదా" కలవరపడుతూ అడుగుతోంది గిరిజ.

"ప్రమాదంలో కాకపోతే నిప్పుల్లో ఉండనీ, నాకు చింతలేదు. దానికి నా బిడ్డ రక్తం మాత్రం ఇవ్వనివ్వను" కసిగా అంది అమ్మ, నా చెయ్యి వదలకుండా.

"వాళ్ళు మీకు తెలుసా అమ్మా"

అనుమానంగా అడిగింది గిరిజ.

"తెలుసు" తమాయించుకోటానికన్నట్టు ఓ క్షణం ఆగింది అమ్మ. "ఇదిలా మొదులా

మిగిలిపోటానికే నేనిట్లా ముండమోపినవ్వ టానికే కారకులెవరో తెలుసా? వాళ్ళు. ఇప్పుడు చెప్పు. కాటేసిన పాముకి పాలు పొయ్యమంటావా?" ఆవేశపడితే అమ్మకి ఆయాసమొస్తుంది.

ఇక మాట్లాడలేకపోయింది గిరిజ.

"జబ్బుపడ్డది ఎవరమ్మా?" సంశయిస్తూనే నిర్ధారణ కొరకు అడిగాను.

"జాహ్నవి"

హతోస్మి. జాహ్నవి అంటే జయమ్మ పిన్ని కూతురు. అర్థిస్తే రాష్ట్రపతి క్షమాభిక్షయినా దొరకవచ్చేమోగానీ అలా వేడుకునే అర్హత కూడా లేదు మా దృష్టిలో వాళ్ళిద్దరికీ.

నేను నిస్సహాయంగా చూసి లేచాను.

"నెవర్‌మైండ్. నీ బ్లడ్ అయితే మరే ప్రాబ్లమ్ ఉండదు కదా అనుకున్నాను. అంతే. నేను ఆల్టర్నేట్ కోసం ప్రయత్నిస్తాను" అంది గిరిజ.

ఆసుపత్రి బయటకు వచ్చేశాం. అమ్మని ఆటో ఎక్కించాను.

"ఆగు, ఇలారా."

స్కూటీ స్టార్ట్ చేయబోయేదాన్నల్లా ఆగి ఆటో దగ్గరకొచ్చాను.

"నామీద ఒట్టెయ్. వెనక్కెళ్ళి రక్తం ఇచ్చిరానని" నా చెయ్యి లాగి తన తలమీద పెట్టుకుందమ్మ. పట్టుపడితే అమ్మంత మొండిది లేదు.

"అలాగే"

ఆటో కదిలింది.

నేను ఆఫీసుకు వచ్చేశాను. లెడ్జర్లు ముందే సుకున్నాను. మనస్సు కల్లోలంగా ఉంది. పేజీల్లో అంకెలూ అక్షరాలూ అల్లుకుపోయి అవుపడుతున్నాయి.

నాకు తెలుసు. గిరిజ ఇప్పుడు ఫోన్ చేస్తుంది- 'ఏమిటా గాథ?' అని. ఏమని చెప్పను? వద్దు వద్దంటున్నా మనస్సు గతాన్ని కెలికింది.

★ ★ ★

టౌనుకి కాస్త దగ్గరగా ఉన్న పెద్ద పల్లెటూరు మాది. పంచాయతీ ఆఫీసుతో పాటు ఆసుపత్రీ చిన్న గ్రంథాలయమూ, హైస్కూలు కూడా ఉన్నాయ్. ఆ హైస్కూల్లో తెలుగు మాస్టారు మా నాన్న. బాషా ప్రవీణ ఆయన. శాస్త్రం తెలిసినవాడనీ, సంస్కృతం చదివినవాడనీ, మంచీచెడ్డా విచక్షణ కలవాడనీ ఊళ్లో అందరికీ నాన్నంటే గౌరవం, భక్తి.

నాకు పదేళ్ళప్పుడనుకుంటాను- మా జయమ్మ పిన్నివాళ్ళు వాళ్ళ ఒక్కగానొక్క సంతానం జాహ్నవిని తీసుకుని మా ఊరికి కాపురమొచ్చేశారు. మా చిన్నాన్నగారు అన్నదమ్ముల విభేదాలతో విడిపోయి మా అమ్మానాన్నల ప్రోద్బలంతో ధాన్యం కమీషన్ వ్యాపారం ప్రారంభించారు ఈ ఊరొచ్చి. మా ఇంటికి రెండు సందుల ఆవతల వీధిలోనే ఉండేవాళ్ళు.

వాళ్ళూ మేమూ చాలా అన్యోన్యంగా ఉండేవాళ్ళం. చిన్నతనంలోనే తల్లిపోతే ఒకరికి ఒకరై పెరిగారట అమ్మా పిన్నీ. పిన్నంటే అమ్మకి పంచప్రాణాలు. జాహ్నవికీ నాకూ దాదాపు ఒకే వయస్సు. స్కూల్లోనూ ఇంటాబయటా అంటుకు తిరిగేవాళ్ళం. మా ఆటలకీ కబుర్లకీ నవ్వులకీ ఎంత సమయమూ చాలేది కాదు. మా అన్న గోపీ అయితే ఎప్పుడూ పిన్నీ వాళ్ళింట్లోనే ఉండేవాడు. మగపిల్లలు లేకపోవటంవల్ల అనుకుంటాను.., చిన్నాన్నగారు కూడా వాణ్ణి బాగా చేరదీసేవారు.

ఆ రోజులెంత బావుండేవని. అమ్మ తరచూ ఏదో స్పెషల్ వంట - గుమ్మడి పులుసు చేశాననో, మెంతి వంకాయ బాగా కుదిరిందనో పిన్నివాళ్ళని భోజనానికి పిలిచేది. పిన్ని ఇంట్లో ఏ టిఫిన్ చేసినా తీసుకొచ్చి మాకు రుచి చూపించేది. ఇక పండగలూ పబ్బాలూ పూజలూ పంక్షన్లూ లాంటి విశేష మైన రోజులైతే చెప్పనే అక్కర్లేదు - అందరం ఒకరి ఇంట్లోనే జరుపుకునేవాళ్ళం. అందరం



చేరినచోట సంతోషం విరగపండేది.

జీవితం సుఖంగా జరిగిపోతున్నప్పుడు కాలం పరిగెడుతోందన్న సంగతే గుర్తుండదు. చూస్తుండగానే పిన్నివాళ్ళు మా ఊరొచ్చి అయిదేళ్ళయిపోయింది.

హాయిగా వీనులవిందు చేస్తూ సాగిపోతున్న రాగాలాపనలో ఉన్నట్టుండి ఓ అపశ్రుతి దొర్లింది.

మా చిన్నాన్న ఒక ఆసామికని బేరమాడిన ధాన్యాన్ని ఎక్కువ కమీషన్‌కి ఆశపడి ఇంకొకరికి అప్పగించాడని అభియోగం.

"చూశారా మాస్టారూ, మీ తోడల్లుడు ఏం చేశాడో- నేనతని మాటనమ్ముకుని మిల్లు వాళ్ళకి ధాన్యం వేస్తానని ఒప్పుకున్నాను. అడ్వాన్సు కూడా తీసుకున్నాను. ఇప్పుడీయన ఇలా మోసం చేశాడు. అదేమిటయ్యా అనడిగితే, 'మాటే గదా అన్నాను, బయానా తీసుకోలేదు కదా. అంచేత నేను చేసినదాన్లో తప్పేంలేదూ' అంటున్నాడు. ఇదేమన్నా బాగుందా చెప్పండి. ఇప్పుడా మిల్లు వాళ్ళకి ఏం సమాధానం చెప్పన్నేను" అని నాన్న దగ్గర వాపోయాడా నష్టపోయిన పెద్దమనిషి.

"ఈ పల్లెటూర్లలో డబ్బుకంటే మాటకే విలువెక్కువ కేశవా! వ్యాపారానికి నిజాయతీ ముఖ్యం. రేపు నీ మాటలెవరు నమ్ముతారు చెప్పు. నువ్వు చేసింది చాలా తప్పు సుమా" పెద్ద తరహాగా చిన్నాన్నని మందలించారు నాన్న.

ఎదురు మాట్లాడలేదుగానీ చిన్నాన్నకది నచ్చలేదు. అహం దెబ్బతింది. 'ఈయనెవరు నాకు చెప్పడానికి' అన్నారట వెనకాల. అప్పట్నుంచీ ఇద్దరిమధ్యనా సుహృద్భావం చెడింది. అమ్మ సర్దిచెప్పే ప్రయత్నం చేసింది. చిన్నాన్న మొహం ముడుపు విడలేదు. నాల్రోజులు గడిస్తే అపార్థాలు వాటంతట అవే మాసిపోతాయి అని ఆశపడింది అమ్మ. కానీ, అందుకు పరిస్థితులు అనుకూలించలేదు. నాన్న అన్నట్టుగానే ఆ నష్టపోయినతను చేసిన ప్రచారంతో చిన్నాన్న వ్యాపారం బాగా కుంటుపడింది. కూడతీసుకోటానికి చాలా కష్టపడాల్సి వచ్చింది.

ఈలోపల ఎన్నో డబ్బు ఇబ్బందులు. వాటి మూలంగా ఆలుమగల మధ్య కీచులాటలు... అవి చాలవన్నట్టు ఆ ఏడాదే జాహ్నవి టెన్త్ ఫెయిలయ్యింది. వెక్కిరిస్తున్నట్టుగా నేను ఫస్టుక్లాసులో పాసయ్యాను.

ఈ చికాకుల్లో మొదట్లో తటస్థంగా ఉన్న పిన్ని పూర్తిగా మగనివైపుకి తిరిగిపోయింది. తమ ఇక్కట్లన్నిటికీ మూలం పాపాలన్నిటికీ భైరవుడూ మా నాన్నే అన్న నిర్ణయానికి వచ్చేసింది. రాకాపోకా తగ్గించేసింది. పుల్లవిరుపు మాటలూ నిష్ఠూరాలూ ఎక్కువయ్యాయి. ఎప్పట్నుంచి దాచుకున్నదో ఏమో మామీద అసూయని- మేము ఆస్తిపరులం కావటం, జాహ్నవికి చదువు అబ్బకపోవటం, నేను అందంగా ఉంటాననీ వాళ్ళూ వీళ్ళూ అనటం, ఊరివాళ్ళంతా మాపట్ల ఎక్కువ వినయ విధేయతలు కనబరచటం... వీటన్నిటిమీదా తన అక్కసుని వ్యంగ్యంగా వెటకారంగా ఎద్దేవా చేస్తున్నట్టుగా మాటల్లో బయటపెడుతోంది పిన్ని.

"మాకే ముదనష్టాలూ కలవలేదమ్మా. పైసా కోసం అలానే కక్కుర్తిపడతాం మరి..." అన్నదోసారి.

ఎప్పుడో నాన్న మేనత్తకి పిల్లలు లేని కారణంగా ఆవిడ ఆస్తి మా నాన్నకి రాసిపోయిందట - అదీ విషయం.

'బంగారబ్బొమ్మ, చదువుల సరస్వతి' అని నోరారా నన్ను మెచ్చుకున్న మా పిన్ని, 'తెల్ల తోలుండగానే సరా, కళా కాంతీ ఉండక్కర్లా' అంటోందిప్పుడు. మా నాన్న స్కూల్లో మాస్టారవటంబట్టే నాకు మార్కులు ఎక్కువేయించి క్లాసు తెప్పించారన్నది ఇంకోసారి.

'నా చెల్లెలు ఇంత చుప్పనాతా?'

పాపం విలవిల్లాడిపోయింది అమ్మ.

ఇవన్నీ చిన్నచిన్న మొట్టికాయలు. కపాలం

బద్దలయ్యే పిడికిలిపోటు తరవాత వేసింది.

★ ★ ★

నేను కాలేజీలో చేరాను. అన్నయ్యతోపాటు బస్‌లో కాలేజీకి టౌన్‌కి వెళ్ళి వస్తున్నాను.

ఆరోజు- బస్ వచ్చే టైమయిందని త్వర త్వరగా తయారవుతున్నాం అన్నయ్యా నేనూ.

"ఇంత పొద్దెక్కింది. రాజేశ్వరమ్మగారు ఇంకా లేచినట్టుగా లేదు. ఒంట్లో బాగుందో లేదో ఓసారి చూసిరా" అంది అమ్మ.

రాజేశ్వరమ్మ ఆంటీది మా పక్కిల్లే. ఒంటరిగా ఉంటారు. భర్త పోయి నాలుగేళ్ళయింది. పొలం నుంచి వస్తుంటే పురుగు ముట్టిందట. కూతురు అత్తవారింట్లోనూ కొడుకు వేరే రాష్ట్రంలో చదువుకుంటూనూ ఉన్నారు. మంచావిడ. తనేమో తన పనేమో, అంతే. పిన్ని తనకు దూరమైన వెలితితో అమ్మ ఈమధ్య తనకు తానుగా ఆవిడకు చేరువయింది.

తలంటుకున్న జుట్టు ముడి వేసుకుంటూనే హడావుడిగా పక్కింటికి వెళ్ళాను. తలుపు తట్టబోతే దగ్గరకు వేసుంది కాబోలు- తెరుచుకుంది. ఆంటీని పిలుస్తూ లోపలికి వెళ్ళాను. మూలుగు వినిపించి, గదిలోకి వెళ్ళాను. జ్వరమొచ్చినట్టుంది, మంచం మీద పడున్నారు ఆంటీ. ఒంటిమీద చేయి వేశాను. కళ్ళు తెరిచారు.

"భయపడకండి ఆంటీ, అమ్మని పంపిస్తాను" అంటూ వంగున్నదాన్ని లేవబోతున్నాను. అప్పుడు పడిందో చేయి భుజంమీద కర్కశంగా.

ఒళ్ళు జలదరించింది. "ఎవరు?" అన్నాను హడలిపోతూ. జవాబుగా నా రెండోభుజం మీద కూడా బలంగా. చేయి వేసి ముందుకు తిప్పుకుంటున్నదో మృగం.

"ఒరేయ్, అదేం పనిరా... ఒదులు, ఒదలరా వెధవా. వద్దురా, తప్పురా" అంటూ లేవలేక లేస్తూ అడ్డుకోవాలని చేయి చాస్తూ అరిచారు ఆంటీ.

ఏమవుతోందో నాకేం తెలీటంలేదు. పెనుగులాడుతున్నాను, అరుస్తున్నాను. అదృష్టం... ఆంటీ ఎలాగో లేచారు. తూలుతూ వచ్చి వాడి వీపుమీద చరిచారు. నన్ను విడిపించారు. తలుపు తెరుచుకుని బయటపడ్డానెలాగో.

ఎలా ఉన్నానప్పుడు... ఓణీ ఎక్కడో పడిపోయింది. జాకెట్ హుక్ తెగిపోయింది. జుట్టుముడి విడిపోయింది. ఆయాసంతో ఏడుస్తూ ఇంటికి పరిగెత్తుకు వచ్చాను. 'బయట ఎవరైనా ఉన్నారా, నన్ను చూస్తున్నారా' అన్న స్పృహే లేదు.

నా వెనకే ఆంటీ కూడా పడుతూ లేస్తూ వచ్చారు మా ఇంటికి. మా అమ్మ చేతులు పట్టుకున్నారు కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ "రేవతీ, నన్ను క్షమించమ్మా. వాడు మనిషి కాదు పశువు. అర్ధరాత్రివేళప్పుడు వచ్చాడు. డబ్బిమ్మని కాళ్ళావేళ్ళా పడ్డాడు. పినతల్లి కొడుకమ్మా వాడు. కాదనలేకపోయాను. అంత రాత్రప్పుడు పొమ్మనలేక తెల్లారగానే ఇంతో అంతో ఇచ్చి పంపించేద్దామనుకున్నాను. పులకమొచ్చి లేవలేకపోయానమ్మా. తాగుబోతని తెలుసుగానీ సీసా వెంట తెచ్చుకుంటాడనిగానీ పొద్దున్నే తాగి ఇంత అఘాయిత్యం చేయబోతాడనిగానీ అనుకోలేదు. ఎలాగో లేవగలిగాను కాబట్టి సరిపోయింది. బిడ్డ దడిచిపోయింది. నన్ను మన్నించు తల్లీ. వాణ్ణిప్పుడే తన్ని తగిలేస్తాను" అంటూ విలవిల్లాడిందావిడ.

మా పిన్నికి ఈ వార్తని ఎవరు ఏ రకంగా అందించారో, ఆవిడ దాన్ని ఇంకెలాగ అర్థం చేసుకుందో తెలీదుగానీ - ఈ సంఘటననీ మూణ్ణెళ్ళ తరవాత టౌన్‌లో నాకు చేయించిన అపెండిసైటిస్ ఆపరేషన్‌నీ ముడిపెట్టి దానికో దిక్కుమాలిన రంగు అద్ది ఆయుధంలాగా దాచి, సిద్ధంగా ఉంచుకుందనుకుంటాను.



మూడేళ్ళ తరవాత ఆ ఆయుధాన్ని ప్రయోగించే అవకాశం దొరికిందావిడకి.

★ ★ ★

నా నిశ్చితార్థం ఇంకొన్ని గంటల్లో. పెళ్ళివారి కోసం ఎదురుచూస్తున్నాం. వరుడు ఎవరో కాదు... మా అన్నయ్య క్లాస్‌మేట్ గిరీష్. అప్పుడప్పుడూ మా ఇంటికి వస్తూండేవాడు. నన్ను ఇష్టపడ్డాడని నాకే తెలీదు. పెళ్ళి ప్రస్తావన వాళ్ళవైపు నుంచే వచ్చింది. మంచి సంబంధమని, నా డిగ్రీ పూర్తవకపోయినా ఒప్పుకున్నారు నాన్న.

ముహూర్తం దగ్గరపడింది. వాళ్ళు రాలేదు. సమయం దాటిపోయింది. వాళ్ళు రానేలేదు. అన్నయ్య సెల్‌కి సమాధానమొచ్చింది. తాము రావటంలేదనీ ఒకసారి అబార్షన్ అయిన పిల్ల తమకవసరంలేదనీ కరుగ్గా చెప్పిందట గిరీష్ తల్లి.

అంతే, అక్కడికక్కడే కూలిపోయారు నాన్న. మరి లేవనేలేదు. అప్పటివరకూ ఆనందోత్సాహాల వెల్లువలా ఉన్న ఇల్లు క్షణంలో శోకసముద్రమయింది. పచ్చని తోరణం కట్టిన ఇంటి ముందునుంచి ఏడుకట్ల సవారీ ఎక్కి తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయారు నాన్న.

ఎంతటి విషాదమైనా తొలినాటి గాఢత నిలవదు. మా దుఃఖం పలచబడింది. అన్నయ్య తనవంతు బాధ్యతగా గిరీష్ దగ్గరకు వెళ్ళాడు. "మీకు దగ్గర బంధువులు చెప్పిన సమాచారమే ఇది. మీతో బంధుత్వానికి మా 'పేరెంట్స్' ఇష్టపడటంలేదు. సారీ" అన్నాడట గిరీష్.

'ఇది పిన్నీవాళ్ళ నిర్వాకమే' ఆవేశపడ్డాడు అన్నయ్య. అమ్మా నేనూ ఊరుకోబెట్టాం.

ఆ తర్వాత చిన్నాన్న, పిన్నీ గిరీష్ వాళ్ళ దగ్గరకు పిల్లనిస్తామని వెళ్ళి, కాదనిపించుకు వచ్చారట. అన్నయ్యకి కోపం ఆగక, అడ్డుకుంటున్నా వినక పిన్నీవాళ్ళ మీదకి జగడానికి వెళ్ళాడు. ఫలితమేముంటుంది... అల్లరి మాత్రం అయింది.

'ఏమో మరి. ఆ రోజున ఆ అమ్మాయి ఆ ఇంట్లోంచి బయటకు వచ్చిన వాలకం అనుమానాస్పదంగానే ఉంది మరి. మూణ్ణెళ్ళ తరవాత ఆసుపత్రిలో నాల్రోజులుండి తిరిగొచ్చిన మాటా నిజమే. ఏమో, ఏ పుట్టలో ఏ పాముందో మనమేం చెప్పగలం? ఏ నిప్పూ లేకపోతే పెళ్ళెందుకు చెడగొడతారు అంత దగ్గరివాళ్ళు?'- చెవులు కొరుక్కున్నారు లోకులు.

అవమానభారంతో ఆ ఊరొదిలిపెట్టేశాం. విషాదాన్ని దిగమింగుకుంటూ చదువుల్లో పడిపోయాం. అమ్మ నాకు పెళ్ళి ప్రయత్నాలు చెయ్యబోయింది. వద్దన్నాను. ఇంకా పరాభవాల్ని ఎదుర్కొనే ధైర్యం నాకులేదని కచ్చితంగా చెప్పేశాను. అన్నయ్య ఉద్యోగం వంకన విదేశాలకు వెళ్ళిపోయాడు.

అమ్మా నేనూ కాలాన్ని తోస్తూ మిగిలిపోయాం. ఉద్యోగరీత్యా ఎన్నో ఏళ్ళు ఎక్కడెక్కడో తిరిగితిరిగి ఇన్నేళ్ళకు మళ్ళీ ఈ టౌనొచ్చాం. చెంపలు నెరుస్తున్నాయి నాకు. ఆశలకీ కోరికలకీ అతీతంగా బతకటం అలవాటు చేసుకున్నాను. జీవితం ప్రశాంతంగా గడిచిపోతోంది. ఇప్పుడు అవకాశం దొరికింది గదా అని ఎప్పుడో జరిగిపోయిందానికి ప్రతీకారం తీర్చుకోవాలని నాకసలు లేదు. బ్లడ్ అవసరమైన వాళ్ళకు ఎప్పుడూ కాదనక డొనేట్ చేస్తూనే ఉంటాను. ఇప్పుడు వీళ్ళకు అవసరమైంది. ఎందుక్కాదనాలి? అంతేకాదు, ఎవరో చెప్పినట్టు అపకారికి ఉపకారం చేయటం విజ్ఞత కదూ! పిచ్చి అమ్మ, అమ్మ వేసిన ఒట్టు తీసి గట్టుమీద పెట్టేశాను.

★ ★ ★

గిరిజకి ఫోన్ చేశాను. "పావుగంటలో వస్తున్నాను, నువ్వు టెన్షన్ పడకు" అని.

"అవసరం లేదు, బ్లడ్ దొరికింది. దేవీ నీకో విచిత్రం చెప్పనా... చెప్పొద్దని ఒట్టేసినా చెప్పేస్తున్నా. ఆ డోనరు ఎవరనుకున్నావ్... అమ్మ."

ఉలిక్కిపడ్డాను. చెప్పలేదు కదూ అమ్మది కూడా నా బ్లడ్‌గ్రూపే.

★